సాక్షి
వికారాబాద్
ఆదివారం | 28 | మే | 2023



**కొనేదెట్లా?**
వానాకాలం సీజన్ ముంచుకొస్తున్నా.. నేటికీ దెబ్బతిన్న పంటలకు పరిహారం అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



**అందని 'సహకారం'**
వ్యవసాయమే జీవనోపాధిగా ఎంచుకున్న రైతన్నలకు ప్రభుత్వం నుంచి సహకారం కొరవడింది. 9లో▸



**బాల్య వివాహాలను అరికట్టాలి**
బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. 9లో▸

## న్యూస్‌రీల్

### ఏహెచ్‌టీయూలో వికారాబాద్‌కు ప్రథమ స్థానం




ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ దాసు

**అనంతగిరి:** మానవ అక్రమ రవాణాను అరికట్టడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడంలో వికారాబాద్ జిల్లా ముందు వరుసలో నిలిచిందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఈమేరకు ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీపీ షికాగోయల్ చేతుల మీదుగా ఏహెచ్‌టీయూ (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) ఇన్‌స్పెక్టర్ దాసు ప్రశంసా పత్రం అందుకున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 2022 సంవత్సరానికి గాను తెలంగాణలోని 31 ఏహెచ్‌టీయూ టీంలలో మన జిల్లా అగ్రభాగంలో నిలిచిందన్నారు. విధి నిర్వహణలో భాగంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, ప్రమాదకరమైన కర్మాగారాల్లో పనిచేస్తున్న బాలల వివరాలను సేకరించి ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌తో గత ఏడాది 316 మంది పిల్లలను కాపాడి.. వీరిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచారన్నారు. వీరి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించి.. పిల్లలను బడికి పంపించేలా ప్రోత్సహించామని తెలిపారు. చైల్డ్ లేబర్‌ను పనిలో పెట్టుకున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామని స్పష్టంచేశారు. మహిళల మిస్సింగ్ కేసులు, బాల్య వివాహాలు, గృహహింస, సైబర్ నేరాలు, డయల్ 100, చైల్డ్‌లైన్ 1098 తదితర అంశాలపై విస్తృత ప్రచారం చేశామన్నారు. సందర్భంగా సీఐ దాసు, అతని టీంను ఎస్పీ అభినందించారు.

### నేడు ఎల్మినేడుకు ముఖ్యమంత్రి కేసీఆర్

**ఇబ్రహీంపట్నం:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదివారం ఎల్మినేడు గ్రామానికి రానున్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తల్లి పద్మమ్మ దశదినకర్మ కార్యక్రమానికి సీఎం హాజరవుతున్నారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించనున్నారు. సీఎం హెలికాప్టర్‌లో వస్తుండటంతో ఎల్మినేడులోని ఎమ్మెల్యే ఫాంహౌస్ దగ్గర హెలిపాడ్‌ను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సీఎం రానున్నట్లు సమాచారం. కాగా, పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

### దరఖాస్తులకు ఆహ్వానం

**ఇబ్రహీంపట్నం రూరల్:** ధైర్యసాహసాలు కనబర్చిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ హరీశ్ ఒక ప్రకటనలో కోరారు. నేషనల్ బ్రేవరీ అవార్డ్స్ ఫర్ చిల్డ్రన్ కింద ఈ అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. జిల్లాకు చెందిన అభ్యర్థులై ఉండాలని, జూన్ 15వ తేదీ నుంచి అక్టోబర్ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### 8 నుంచి ఫుడ్ ఫెస్టివల్

**హుడాకాంప్లెక్స్:** జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో జూన్ 8, 9, 10 తేదీల్లో చేప ఉత్పత్తుల ఆహార మేళా (ఫుడ్‌ఫెస్టివల్)ను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మేళాలో 20 స్టాల్స్‌ను ఏర్పాటు చేసి చేపలు, రొయ్యల ప్రత్యేక వంటకాల కార్యక్రమం ఉంటుందని, వంటలలో అనుభవం ఉన్న వారు పాల్గొని స్టాల్‌ను ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్ఐటీహెచ్ఎంలో శిక్షణ పొందిన మహిళలు, మహిళా మత్స్యకారులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల వారు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, మత్స్యకార కమ్యూనిటీకి చెందిన వారు అర్హులని పేర్కొన్నారు.

# ఎండల్లో హాయ్‌హాయ్

సండే స్పెషల్

- స్విమ్మింగ్‌పై యువత, చిన్నారుల ఆసక్తి
- సెలవులను సద్వినియోగం చేసుకునే దిశగా ముందుకు..
- కిటకిటలాడుతున్న ఈత కొలనులు



సయ్యద్‌మల్కాపూర్‌లో స్విమ్మింగ్ చేస్తున్న చిన్నారులు

**పరిగి:** మండుతున్న ఎండల నేపథ్యంలో యువత, చిన్నారులు చల్లదనం వైపు పరుగులు తీస్తున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఈత వైపు మొగ్గు చూపుతున్నారు. సెలవులను సద్వినియోగం చేసుకునే దిశగా ఈత నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. పలు రకాల క్రీడలతో పాటు డ్యాన్స్‌పై శిక్షణ పొందుతున్నారు. పరిగి పట్టణ కేంద్రం, సయ్యద్‌మల్కాపూర్‌లోని స్విమ్మింగ్ పూల్స్ పెద్దలు, యువత, చిన్నారులతో కిటకిటలాడుతున్నాయి. ఇక్కడ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ పిల్లలకు ఈత నేర్పిస్తున్నారు. గంటకు ఒక్కొక్కరికి రూ.100 తీసుకుంటున్నారు.

**అనేక ప్రయోజనాలు**

ఈత కొట్టడం వల్ల వేసవి తాపం నుంచి ఉపశమనం కలగడమే కాక, మంచి ఆరోగ్యం లభిస్తుంది. క్రమం తప్పకుండా ఈతకెళ్తే ఒంట్లోని అనవసర కొవ్వు కరుగుతుంది. ఆకలి, చురుకుదనం, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతాయి. మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు అదుపులో ఉంటాయి. 30నిమిషాల పాటు ఈత కొడితే సుమారు 300 కేలరీల శక్తి ఖర్చవుతుంది. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టే ముందు నీరు శుభ్రంగా ఉందో లేదో గమనించాలి. ప్రస్తుతం వేసవిలో ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలతో పాటు, పెద్దలు స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్తున్నారు. వీరిని బ్యాచ్‌లుగా విభజించి గంట పాటు స్విమ్మింగ్‌కు సమయం ఇస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వంద మందికిపైగా ఈత కొట్టేందుకు వస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లేటప్పుడు స్విమ్ సూట్స్, క్యాప్స్, ట్యూబ్స్ తప్పనిసరిగా వాడాలి.
- ఈతరాని వారి వెంట ఈత వచ్చిన వారు ఒకరు ఉండాలి.
- చిన్నపిల్లలకు కోచ్ పర్యవేక్షణలో ప్రాక్టీస్ చేయిస్తే సులువుగా నేర్చుకుంటారు.
- తల వెంట్రుకలు స్విమ్మింగ్‌పూల్‌లో రాలకుండా క్యాప్ ధరలించాలి.
- ఈత కొట్టి ఇంటికి వచ్చిన తర్వాత శుభ్రమైన నీటితో మళ్లీ స్నానం చేయాలి.

### నిత్యం ఈత కొడుతున్నా



వేసవి సెలవులు కావడంతో నిత్యం ఈత నేర్చుకునేందుకు వస్తున్నా. గతేడాది ఈత నేర్చుకున్నా. ఈసారిమరింత పర్‌ఫెక్ట్ అయ్యా. నాతో పాటు మా కాలనీకి చెందిన ఫ్రెండ్స్ వస్తున్నారు.

– రాము, రూప్‌ఖాన్‌పేట్, పరిగి

### వేడి తెలియడం లేదు..



ఈత నేర్చుకోవాలనే ఉద్దేశంతో చౌదర్‌గూడెం నుంచి వస్తున్నాం.. స్విమ్మింగ్ చేస్తుంటే చల్లగా, హాయిగా ఉంది. నీళ్లలో ఉన్నంత సేపు ఎండ వేడిమి అస్సలు తెలియడం లేదు.

– అద్నన్, చౌదర్‌గూడెం

### వంద మంది వస్తున్నారు



ఈత నేర్చుకునేందుకు నిత్యం వంద మంది స్విమ్మింగ్ పూల్‌కు వస్తున్నారు. మా పర్యవేక్షణలో ఈత నేర్పుతున్నాం. స్విమ్మింగ్ పూల్‌లో ప్రతి రోజు నీటిని తీసి స్వచ్ఛమైన నీటిని నింపుతున్నాం.

– రాజేష్, ట్రైనర్, పరిగి

# ఓటరు లిస్ట్‌లో తప్పులుండొద్దు

- మార్పులు, చేర్పులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- బీఎల్‌ఓలకు సరైన అవగాహన కల్పించాలి
- తహసీల్దార్ల సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన అడిషనల్ కలెక్టర్

**వికారాబాద్ అర్బన్:** ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా మార్పులు, చేర్పులు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. డబుల్ ఓటర్ల గుర్తింపు, ఇంటింటి సర్వే తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. పకడ్బందీగా జాబితా తయారు చేయాలని సూచించారు. ఓటరు జాబితా రూపకల్పనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుబంధ ఫారం 1 నుంచి 5వరకు బీఎల్‌ఓలకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. వీరిచ్చే సమాచారం సరిగ్గా ఉందా లేదా అనేక విషయాలను సరిచూసుకోవాలన్నారు. విధుల్లో సక్రమంగా పనిచేయని వారిని మార్చుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఓటర్ జాబితాలోని మార్పు, చేర్పులను సరిచూసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని, పోలింగ్ స్టేషన్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అక్కడి పరిస్థితులను తెలుసుకోవాలని వివరించారు. పోలింగ్ సెంటర్ల వద్ద ర్యాంపులు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయలను గుర్తించి జూన్ 20లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌ఓ అశోక్‌కుమార్, ఆర్డీఓ విజయకుమారి పాల్గొన్నారు.

### చకచకా మెడికల్ కాలేజీ పనులు

ప్రభుత్వ వైద్య కళాశాలలో 2023– 24 విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. ఆరోగ్య శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న కళాశాల, టీబీ శానిటోరియం పనులు చివరి దశకు చేరుకున్నాయని వివరించారు. పట్టణంలోని రాజానగర్‌లో నిర్మిస్తున్న ఆస్పత్రి మొదటి అంతస్తు భవన నిర్మాణం పనులు ముగింపు దశకు వచ్చాయని, రెండో అంతస్తు పనులు కూడా జూలై 15 నాటికి పూర్తవుతాయని వివరించారు. తొలిసారి ప్రారంభం కానున్న మెడికల్ కాలేజీలో విద్యార్థులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని స్పష్టంచేశారు.

# కరన్‌కోట్‌లో అక్రమ మైనింగ్



కరన్‌కోట్ శివారులో అనుమతి లేకుండా కొనసాగుతున్న నాపరాతి గనులు

- యథేచ్ఛగా నాపరాతి తవ్వకాలు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు

**తాండూరు రూరల్:** తాండూరు మండలంలో నాపరాతి అక్రమ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. కళ్లముందే యథేచ్ఛగా దందా సాగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇక్కడ కనెక్షన్ లేకుండా విద్యుత్ వినియోగిస్తున్నా ఆశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇలా పెద్ద ఎత్తున తరలిపోతున్న నాపరాతితో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. దీనంతటికీ తాండూరు మండలం కరన్‌కోట్ వేదికగా మారింది. మేజర్ పంచాయతీ అయిన ఈ గ్రామ శివారులో ప్రభుత్వ, ప్రైవేటు నాపరాతి భూములు ఉన్నాయి. కొందరు అక్రమార్కులు నాపరాతి వ్యాపారంపై దృష్టి పెట్టారు. ప్రైవేట్ నాపరాతి భూముల్లో ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయాలన్నీ తెలిసినా సంబంధిత అధికారులు చడీచప్పుడు చేయడం లేదు. పత్రికలు, టీవీల్లో కథనాలు వస్తే కంటితుడుపు చర్యలుగా నోటీసులు జారీ చేస్తూ చేతులు దులుపుకొంటున్నారు.

**అసైన్‌మెంట్ భూమిలో...**

కరన్‌కోట్ శివారులోని ప్రభుత్వ భూములను ప్రభుత్వం అప్పట్లో కొందరు పేదలకు కేటాయించింది. ఆతర్వాత కొంత కాలానికి ఈ భూముల్లో పెద్దలు తిష్ట వేశారు. రెవెన్యూ అధికారులను మేనేజ్ చేస్తూ నాపరాతి తవ్వకాలు చేపడుతున్నారు.

**కార్యాలయానికే పరిమితం**

తాండూరు మండలంలోని కరన్‌కోట్‌లో అక్రమ మైనింగ్ కొనసాగుతున్నా ఆ శాఖ అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదు. వీరు కేవలం కార్యాలయానికే పరిమితమవుతున్నారు. లీజు లేని పట్టా భూముల్లో తవ్వకాలు జరపుతున్నా పట్టించుకోవడం లేదు. రాయల్టీ లేకుండా ప్రతీ రోజు పెద్ద ఎత్తున నాపరాతిని తరలిస్తున్నారు.

# చేసింది.. చెప్పండి

- 'తెలంగాణ'కు ముందు, తర్వాత పరిస్థితులను వివరించండి
- అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను జనంలోకి తీసుకెళ్లండి
- 20 రోజుల పాటు దశాబ్ది వేడుకలు నిర్వహించాలి
- జిల్లా అంతటా పండుగ వాతావరణం కనిపించాలి
- అధికారులు, ప్రజా ప్రతినిధుల సమావేశంలో మంత్రి సబితారెడ్డి



అమర వీరుల స్థూపం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

**వికారాబాద్:** తెలంగాణ ఏర్పాటుకు ముందు, తర్వాత పరిస్థితులను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని, తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో అందుకున్న విజయాలను స్పష్టంగా వివరించాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో శనివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 2నుంచి 22వ తేదీ వరకు కొనసాగే సంబరాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. 21 రోజుల పాటు గ్రామాలు, పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకొనాలని సూచించారు. కాళేశ్వరం తరహాలో పాలమూరు ఎత్తిపోతలను పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు నీరు అందించేందుకు సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. ఈఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటుపుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.62 కోట్ల నిధులు ఖర్చు చేస్తోందని స్పష్టంచేశారు. ఈ నెల 21వ తేదీలోపు జిల్లా కేంద్రంలో అమర వీరుల స్థూపం నిర్మించి, వేడుకల చివరి రోజున తెలంగాణ అమరవీరులకు అక్కడే నివాళులర్పిస్తామని వెల్లడించారు. అనంతరం స్థూపం నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు.

**దేశానికే ఆదర్శం**

తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో విద్యుత్ సరఫరా బాగా మెరుగుపడిందని మంత్రి అన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో స్వచ్ఛత, అభివృద్ధి సాధించామని తెలిపారు. సుపరిపాలనలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన అవార్డులే ఇందుకు నిదర్శనమని స్పష్టంచేశారు. వికారాబాద్ జిల్లా ఏర్పాటుతో ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. కొత్త మండలాలు, కొత్త పంచాయతీల ఏర్పాటుతో పాలనా సౌలభ్యం మెరుగుపడిందని వివరించారు.

**పురోగతిని వివరించండి**

రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా తెలంగాణ ఏర్పాటుకు ముందు, తర్వాత పరిస్థితిని ప్రజలకు వివరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వ్యవసాయానికి నిరంతర ఉచిత కరెంట్, ఊరూరా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి విషయాలను జనాల్లోకి తీసుకెళ్లాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో సాధించిన పురోగతిని అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు.

**షెడ్యూల్ రూపొందించుకోవాలి**

ప్రభుత్వం 21 రోజుల పాటు అధికారికంగా నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను గడపగడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. రోజువారీగా షెడ్యూల్ రూపొందించుకుని గ్రామాల్లో పర్యటించాలని తెలిపారు. జిల్లాలో ఉన్న 97 రైతు వేదికల్లో రైతు దినోత్సవం నిర్వహించాలన్నారు. రైతులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయాలన్నారు.

**ప్రగతిని వివరిస్తాం**

రాష్ట్రం ఆవిర్భావం తర్వాత పోలీసు శాఖ సాధించిన ప్రగతిని ప్రజలకు వివరిస్తామని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఇందుకోసం పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

**సమన్వయంతో సాగుతాం..**


ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. నియోజకవర్గ స్థాయిలో అందరినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతామన్నారు. అన్ని గ్రామాల్లో అట్టహాసంగా వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, యాదయ్య, మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్,డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్వో అశోక్ కుమార్, ఆర్డీఓ విజయకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ఆయా శాఖల జిల్లా అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

# బీసీలకు యాభైశాతం రిజర్వేషన్లు కల్పించాలి

**బంట్వారం:** చట్ట సభల్లో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలన్నీ బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని మండిపడ్డారు. రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నాయని తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో బీసీలకు రాజకీయంగా కనీస ప్రాతినిధ్యం వహించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జనాభాలో 56 శాతం బీసీలు ఉన్నప్పటికీ చట్ట సభల్లో మాత్రం 14శాతం ప్రాధాన్యం మాత్రమే దక్కుతోందని తెలిపారు. 16 రాష్ట్రాల్లో కనీసం ఒక్క బీసీ ఎంపీ లేకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా పార్టీలు, ప్రభుత్వాల తీరు మారాలన్నారు.త

# అవసరమైతే విప్లవకారులవ్వాలి

- సాహితీవేత్తలకు మంత్రి పిలుపు
- షాద్‌నగర్‌లో 'వంగూరి వాచకం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**షాద్‌నగర్:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సాధనలో కవులు, కళాకారులు, సాహితీవేత్తల పాత్ర ఎనలేనిదని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం షాద్‌నగర్‌లో విశ్రాంత ఉపాధ్యాయుడు వంగూరి గంగిరెడ్డి రచించిన వంగూరి వాచకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే అందులో ఉండే వ్యవస్థల గురించి వాటి స్పందన గురించి తెలుసుకోవాలని కోరారు. ప్రతి మనిషి లౌక్యాన్ని నేర్చుకోవాలని, తద్వార తన జీవితంలో సులభంగా విజయాలను సాధించగలుగుతారని పేర్కొన్నారు. కవులు, సాహితీవేత్తలు సమాజంలో మార్పు కోసం ప్రయత్నించాలని కోరారు. సమాజాన్ని, ప్రజల బతుకులను మార్చే శక్తి కవులు, కళాకారుల్లో ఉందన్నారు. అయితే.. సమాజం పక్కదారి పట్టినప్పుడు సాహితీవేత్తలే విప్లవకారులు అవుతారని మంత్రి పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను పాటలు, కవితలు, ఆటపాటల రూపంలో మారుమూల గ్రామాల ప్రజల్లో చైతన్యాన్ని నింపారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజల కృషితో రాష్ట్రాన్ని సాధించుకొని అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. సమాజానికి అర్థం అయ్యే విధంగా రాసే కవితలు ప్రజల్లో మార్పులు తెస్తాయని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్ పాల్గొన్నారు.

### అగ్ని వీరులుగా ఇద్దరు ఎన్‌సీసీ విద్యార్థులు

**హయత్‌నగర్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ క్యాడెట్స్ విద్యార్థులు భారత సైన్యంలో సేవలు అందించేందుకు అగ్ని వీరులుగా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ జ్యోత్స్న ప్రభ తెలిపారు. బీఎస్సీ థర్డ్ ఇయర్ స్టూడెంట్ కంచర్ల జిగ్నేష్ జగన్మోహన్ ఇండియన్ నేవీకి ఎంపిక కాగా, బీఏ సెకండియర్ చదువుతున్న గౌడుగు వంశీ ఇండియన్ ఆర్మీకి ఎంపికయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.



# బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన వికారాబాద్ జట్లు

**సూర్యాపేటటౌన్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి ములుగు, తృతీయ స్థానం వికారాబాద్ జిల్లా జట్లు పొందాయి. బాలుర విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి వికారాబాద్, తృతీయ బహుమతి కామారెడ్డి జిల్లా జట్లు కైవసం చేసుకున్నాయి.



బాలికల విభాగంలో మూడో బహుమతి అందుకున్న బాలికల జట్టు



బాలుర విభాగంలో రెండో బహుమతి అందుకున్న క్రీడాకారులు

## క్లుప్తంగా

### అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ టీపీ నాయకులు

పరిగి: అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గం కోఆర్డినేటర్లు కోళ్ల యాదయ్య, నరేందర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ రాంబాబుకు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలన్నారు. లాటరీ పద్ధతిలో ఎంపిక విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలన్నారు. అలాగే లబ్ధిదారుల ఎంపికలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వారి స్థితిగతులను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జాకబ్, బాల్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ స్తంభానికి బైక్ ఢీకొని..

యువకుడి మృతి

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు బైక్ విద్యుత్ స్తంభానికి ఢీకొన్న ఘటనలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గండిచెరువు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కుస్మసముద్రం గ్రామానికి చెందిన యూనస్(27) రాత్రి వేళ చౌడాపూర్ నుంచి కుల్కచర్ల వైపు వస్తున్న క్రమంలో గండిచెరువు గ్రామ పరిధిలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి బైక్ ఢీకొంది. దీంతో యూనస్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పూడ్చిన శవానికి పోస్టుమార్టం



రత్నయ్య (ఫైల్)

నవాబుపేట: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన అక్నాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని అక్నాపూర్‌కు చెందిన దయ్యాల రత్నయ్య(50) పంచాయతీ కార్మికుడు. ఈ నెల 18న గ్రామంలోని ఓ పాడుపడ్డ ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే అంత్యక్రియలు చేశారు. శుక్రవారం మృతుడి అన్న చంద్రయ్య మా తమ్ముడి ఆత్మహత్యపై మాకు అనుమానాలు ఉన్నాయని, విచారణ చేసి న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఎస్ఐ భరత్‌భూషన్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించి పూడ్చి పెట్టారు. మృతుడికి భార్య సత్యమ్మ, కుమారులు శ్రీనివాస్, నవీన్‌లు ఉన్నారు.

### విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



మృతి చెందిన పాడి గేదె వద్ద బాధితుడు

బంట్వారం: విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని తొర్మామిడిలో చోటు చేసుకుంది. రైతు గాలి జనార్దన్‌కు చెందిన ముర్రా జాతి గేదె పొలం వద్ద మేత మేస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. పాడి గేదె మృతితో రూ.80 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఎరువులు, విత్తనాలు కొనేదెట్లా?

**పరిహారం అందదాయె.. రుణమాఫీ కాదాయె**
- ముంచుకొస్తున్న వానాకాలం సీజన్
- అయోమయంలో రైతన్నలు



ఎన్కేపల్లిలో వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న తర్బూజ పంట (ఫైల్)

మోమిన్‌పేట: వానాకాలం సీజన్ ముంచుకొస్తున్నా.. నేటికీ దెబ్బతిన్న పంటలకు పరిహారం అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రుణమాఫీ పూర్తి స్థాయిలో కాకపోవడంతో దిగులు చెందుతున్నారు. పది రోజుల్లో మృగశిర కార్తె రానుండటంతో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేదెట్లా అని దిక్కుతోచని స్థితికి గురవుతున్నారు. వేసవి కాలంలో సాగు చేసిన పంటలు అకాల వర్షాలు, వడగళ్లతో చేతికి రాకపోవడంతో రైతులను ప్రభుత్వం ఆదుకొంటుందని అండగా నిలబడుతుందని హామీ ఇచ్చింది. నెలలు గడుస్తున్నా ఇంత వరకు చెతికి చిల్లిగవ్వ అందలేదు. తీసుకొన్న పంట రుణంలో రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చినా ఇంకా పూర్తిస్థాయిలో మాఫీ కాలేదు. దీంతో పరిహారం అందక, రుణ మాఫీ కాకపోవడంతో సాగు చేసేదెట్లా అని ఆందోళనకు గురవుతున్నారు.

**పది రోజుల్లో మృగశిర కార్తె..**

మృగశిర కార్తె పది రోజుల్లో వస్తుండటంతో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాల్సిందే. వర్షాధారపు పంటలు పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలు మృగశిర కార్తెలో వర్షం కురిసిన వెంటనే విత్తనాలను విత్తుకొంటారు. ఎరువులు, విత్తనాల కొనుగోలుకు తక్షణం ప్రభుత్వం సహాయం చేయాలని రైతులు కోరుతున్నారు. గడిచిన నాలుగేళ్లుగా బ్యాంకులలో తీసుకొన్న రుణాలకు వడ్డీ చెల్లిస్తూనే ఉన్నామని రైతులు తెలిపారు. ఇప్పుడు, అప్పుడు అంటూ ప్రభుత్వం కాలాయాపన చేస్తుందే తప్ప రుణమాఫీ చేయడం లేదని వారు వాపోతున్నారు.

**ఎకరాకు రూ. పదివేల పరిహారం ఏదీ?**

ఎకరాకు రూ.10వేల పరిహారం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ అతీగతి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మార్చిలో వడగళ్ల వర్షానికి జొన్న, మొక్కజొన్న, కూరగాయల పంటలు, ఉల్లి, బొప్పాయి, అరటి, కోళ్ల ఫారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పుచ్చ, తర్బూజ తదితర పంటలు చేతికి రాకుండా పోయాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వచ్చి పంట నష్టాన్ని చూసి వెళ్లారే కానీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులకు ఎదురు చూపులే మిగిలాయి. పెట్టుబడులు రాకున్నా ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో కనీసం ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకైనా ఉపయోగపడుతాయని వారు అంటున్నారు.

**మండలంలో..**

మండల పరిధిలోని ఆయా గ్రామాలలో 13,367 మంది రైతులు ఉన్నారు. విడతల వారీగా రుణ మాఫీ చేస్తామన్న ప్రభుత్వం కేవలం 15శాతం మందికి కూడా మాఫీ కాలేదు. మరోవైపు 689 ఎకరాలలో జొన్న, మొక్కజొన్న, కూరగాయలు, బొప్పాయి, అరటి, పూలు తదితర పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 610మంది రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

**ఎదురుచూపులే..**



బ్యాంకులో రూ.లక్ష పంట రుణం తీసుకొన్న. నాలుగేళ్లుగా వడ్డీ చెల్లిస్తూనే ఉన్నా. ఎదురు చూపులు తప్ప ఇప్పటికీ మాఫీ కాలేదు. కౌలుకు రెండు ఎకరాల్లో ఉల్లి, మరో రెండు ఎకరాల్లో టమాట సాగు చేశా. అకాల వర్షాల వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయి. అప్పులే మిగిలాయి.

–రాంచంద్రారెడ్డి, రైతు, ఎన్కేపల్లి

**పరిహారం ఇవ్వాలి**



ఎన్నో ఇబ్బందులకోర్చి ఉల్లిని సాగు చేశాను. అకాల వర్షాలతో పంట అంతా దెబ్బతిన్నది. పంట చేతికొచ్చేవేళ వానలు నిండా ముంచాయి. పది రోజుల్లో మృగశిర కార్తె రానుండటంతో ఎరువులు, విత్తనాలు కొనుగోళ్లపై ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– అంజిరెడ్డి, రైతు

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్



చిన్నారితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్

శంకర్‌పల్లి: ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనల పాటించకపోతే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఇందిరా చిల్డ్రన్స్ ఆస్పత్రిని ఆయన సందర్శించి, వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న చిన్నారులతో మాట్లాడారు. వైద్య సేవలు ఏ విధంగా అందిస్తున్నారనే విషయం ఆరా తీశారు. శుక్రవారం ఆస్పత్రిలో కాలపరిమితి ముగిసిన సెలైన్ ఎక్కించడంతో ఆస్పత్రి యాజమాన్యంపై మండిపడ్డారు. చిన్నారి సృజన(14) ఆరోగ్య పరిస్థితి గురించి వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడారు. చిన్నారి ఆరోగ్యం బాగానే ఉందని వారు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని... ఇష్టానుసారంగా డబ్బులను వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రుల్లో, మెడికల్ షాపుల్లో కాలపరిమితి ముగిసిన మందులు లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది గోపాల్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

# బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్..

## యువకుడు మృతి



ప్రమాదానికి కారణమైన టిప్పర్

మొయినాబాద్: వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ వెనక నుంచి బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో ఉన్న రాణే ఇంజన్ వాల్స్ వద్ద శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన మతుకియ రవి(25), అభిషేక్ మండలంలోని అజీజ్‌నగర్‌లో ఉన్న పటేల్ ప్రీకాస్ట్ కంపెనీలో పనిచేస్తున్నారు. శనివారం ఇరువురు బైక్‌పై అప్పాజంక్షన్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా రాణే ఇంజన్‌వాల్స్ కంపెనీ వద్ద వెనక నుంచి టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న రవి, అభిషేక్ రోడ్డుపై పడ్డారు. రవి తలకు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అభిషేక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అభిషేక్‌ను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# చిరుధాన్యాల సాగుపై మొగ్గుచూపాలి

**తాండూరు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త సుజాత**



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుజాత

తాండూరు టౌన్ : భవిష్యత్తులో చిరుధాన్యాల ఆవశ్యకత ఎంతో ఉందని, అందుకు రైతులు వాటి సాగుపై మొగ్గుచూపాలని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుజాత అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సర వేడుకలను పురస్కరించుకుని శనివారం తాండూరు కేంద్రంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సుజాత మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాల బారిన పడకుండా, ప్రజలు దైనందిన జీవితంలో ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడంలో భాగంగా చిరుధాన్యాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. భవిష్యత్ అంతా చిరుధాన్యాలదేనని అన్నారు. రైతులు వాటి సాగుకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, రైతులు వాటి సస్యరక్షణ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సభ్యులు ద్యావరి నారాయణ, శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి, వ్యవసాయాధికారులు రజిత, యాదగిరి, నజీరుద్దీన్, ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ యమున, ఏకలవ్య ఫౌండేషన్ పాలిటెక్నిక్ విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



ధన్నారంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంతో పట్టణం మరింత పరిశుభ్రంగా మారిందని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల తెలిపారు. ఏడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్‌లోని 34 వార్డులలో కార్మికులు ఏడు రోజుల పాటు పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఏడు రోజుల పాటు కార్మికులు ఎంతో కష్టపడినట్లు తెలిపారు. స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎంతో సహకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, స్థానిక కౌన్సిలర్లు రాములు, అర్థ సుధాకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కార్మికులకు కుళ్లిన బిర్యానీ**

ఏడు రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో కష్టపడి పని చేస్తే కుళ్లిన బిర్యానీ ఇచ్చినట్లు కార్మికులు ఆరోపించారు. పనులు ముగించుకొని ఎంతో ఆకలితో వచ్చిన కార్మికులకు కుళ్లిపోయిన బిర్యానీ ఇవ్వడంపై కార్మికులు అసహనం వ్యక్తం చేశారు. కార్మికుల పట్ల అధికారుల చిన్నచూపు తగదని సీఐటీయూ నాయకులు అన్నారు. కుళ్లిన బిర్యానీ సరఫరా చేసిన చిప్పి మెస్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని కార్మికులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

# మరణంలోనూ అన్న వెన్నంటే..

**సోదరుడి మరణం తట్టుకోలేక గుండెపోటుతో తమ్ముడు మృతి**



లింగం



ఐలేశ్

యాచారం: అసలే దివ్యాంగుడు.. అన్నంటే ఎనలేని ప్రేమ.. అన్న కూడా అన్నీ తానై తమ్ముడిని పోషిస్తున్నాడు. అనారోగ్యంతో అన్న మృతి చెందడంతో తమ్ముడు తల్లడిల్లిపోయాడు. గుండె ఆగి మృతిచెందాడు. ఐదారు గంటల వ్యవధిలోనే అన్నదమ్ములిద్దరూ మృత్యుఒడికి చేరుకోవడంతో ఆ గ్రామం శోకసంద్రమైంది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తమ్మలోనిగూడకు చెందిన చిట్టే మల్లయ్య, పెంటమ్మలకు చిట్టే లింగం(40), చిట్టే ఐలేశ్ (35) చిట్టే కృష్ణ ముగ్గురు కుమారులు. చిట్టే మల్లయ్య ఏడేళ్ల కిందటే విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు.దీంతో చిట్టే లింగం ఎల్ఐసీ సంస్థలో ఉద్యోగం చేస్తూ నగరంలోనే స్థిరపడ్డాడు. భార్య సరిత, ఇద్దరు పిల్లలతో పాటు దివ్యాంగుడైన తమ్ముడు చిట్టే ఐలేశ్‌ను తన వద్దే ఉంచుకుని పోషిస్తున్నాడు. కొన్నేళ్ల కింద చిట్టే లింగానికి కిడ్నీలు చెడిపోవడంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఐదు నెలల కిందట ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఒక కిడ్నీ మార్పిడి చేయించుకున్నా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. లింగం మృతదేహన్ని కుటుంబీకులు స్వగ్రామం తమ్మలోనిగూడెంకు తీసుకువచ్చారు. అన్న అంత్యక్రియల కోసం చిట్టే ఐలేశ్‌ను అదే రాత్రి బంధువులు కారులో తీసుకువస్తున్నారు. కారులో వస్తున్న క్రమంలోనే అన్న మరణాన్ని తట్టుకోలేక గుండె ఆగి మృతి చెందాడు. అనారోగ్యంతో అన్న, బెంగతో తమ్ముడు మృతి చెందడంతో తమ్మలోనిగూడలో శనివార విషాదఛాయలు అలుముకున్నాయి. అన్నదమ్ముల అంత్యక్రియలను ఒకేసారి గ్రామంలో నిర్వహించారు.

## మహిళ ఆత్మహత్య

తలకొండపల్లి: జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్‌యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇంద్రకంటి అంజమ్మ తన కూతురు అశ్వినిని షాద్‌నగర్ జిల్లా కేశంపేట్‌కు చెందిన వెంకటేశ్‌గౌడ్‌కు ఇచ్చి మూడు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. వివాహానికి ముందే అశ్వినికి గొంతుకు సర్జరీ అయ్యింది. ఎండ వేడికి తట్టుకోలేక అశ్విని అనారోగ్యం పాలైంది. ఈ నెల 26న పుట్టినిల్లు గట్టుఇప్పల పల్లికి చేరుకుంది. అదేరోజు సాయంత్రం ఎవరూలేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శనివారం తెలిపారు.

## దొంగ అరెస్టు, రిమాండ్

**చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుళ్లకు రివార్డు**



కానిస్టేబుళ్లకు రివార్డు అందజేస్తున్న డీఎస్పీ శేఖర్ గౌడ్



నిందితుడు అబ్దుల్ సలీం

తాండూరు టౌన్: నాలుగేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న దొంగను పోలీసులు చాకచక్యంగా శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన అబ్దుల్ సలీం లారీ డ్రైవర్‌గా పనిచేసే వాడు. ఒకే నంబర్ ప్లేట్‌పై రెండు, మూడు లారీలను నడపడంతో పాటు వాటిని అక్రమంగా విక్రయించేవాడు. ఈ విషయంలో కేసు నమోదు కాగా రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత కోర్టుకు హాజరు కావాల్సి ఉండగా 2019 నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. పక్కా సమాచారం మేరకు పట్టణ పోలీసులు అబ్దుల్‌సలీంను హైదరాబాద్‌లో అరెస్టు చేసి, శనివారం తాండూరు కోర్టులో రిమాండ్ చేశారు. రెండు నెలలుగా కాపుకాచి చాకచక్యంగా నిందితున్ని పట్టుకున్న కానిస్టేబుళ్లు శివకుమార్, షాబీల్ పాష, సాయప్పలను డీఎస్పీ శేఖర్ గౌడ్ అభినందించి రివార్డు అందజేశారు.

## భార్యను మెట్టింటికి పంపించలేదని..

**భర్త ఆత్మహత్య**

మోమిన్‌పేట్: భార్యను మెట్టింటికి పంపేందుకు అత్తమామలు నిరాకరించడంతో చెట్టుకు ఉరివేసుకుని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం మోమిన్‌పేట మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌ప్రకాశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లికి చెందిన పంచలింగాల అడివయ్య (24)కు మోమిన్‌పేట్‌కు చెందిన రేణుకతో వివాహమైంది. ఇద్దరు పిల్లల సంతానం. అడివయ్య మద్యానికి బానిసై భార్యను హింసించేవాడు. దీంతో రేణుక పుట్టింటికి వెళ్లింది. శనివారం ఉదయం భార్యను తీసుకురావడానికి అత్తగారి ఇంటికి వెళ్లాడు. అత్త, మామలు పంపేందుకు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెంది ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మామిడికాయల దొంగలకు రిమాండ్

యాచారం: ఇద్దరు మామిడికాయల దొంగలను పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలిపంచారు. నగరానికి చెందిన క్లింటన్, వినోద్‌కుమార్‌లు చౌదర్‌పల్లి గేట్ సమీపంలో ఎండీ రహమాన్‌కు చెందిన మామిడి తోటలో రెండు రోజుల కింద మామిడికాయలు కోసి కారులో నగరానికి తరలిస్తున్నారు. మామిడితోటను లీజుకు తీసుకున్న శ్రీనువాస్ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లింటన్, వినోద్‌కుమార్‌లను అరెస్టు చేసి శనివారం రిమాండ్ చేశారు.

# చేవెళ్ల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

చేవెళ్ల: నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీని ఆయన నివాసంలో చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్‌పార్టీ నాయకులు వేర్వేరుగా కలిసి పలు సమస్యలు విన్నవించారు. చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టుకు సంబంధించిన విస్తరణ, పరిధి పెంపుపై చర్చించారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని న్యాయవాదులు చెప్పారు. కోర్టు పరిధి అభివృద్ధి, కోర్టులో ఉన్న సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. దీనిపై మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఎంపీకి బార్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో న్యాయవాదులు అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బి. యాదిరెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, న్యాయవాదులు రాంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాఘునాథ్‌రెడ్డి, శంషోద్దీన్, వెంకటేశం, సంతజీవ్‌రెడ్డి, పెంటారెడ్డి, జనార్దన్, మహేశ్, రామకృష్ణ, మల్లేశ్, శివరాజ్, తదితరులు ఉన్నారు.

**ఎంపీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు**

మండలంలోని గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎంపీని కలిశారు. శనివారం ఆయన నివాసానికి వెళ్లిన వారివారి గ్రామాల్లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చి నట్లు తెలిపారు. ఎంపీని కలిసి వారిలో పార్టీ నాయకులు వనం లక్ష్మీకాంత్ రెడ్డి, భూపతిరెడ్డి, ఎండీ అలీ, యువకులు ఉన్నారు.